## క్లుప్తంగా

### శ్రీముఖలింగంలో లక్ష బిల్వార్చన



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం పరిధిలోని భీమేశ్వర ఆలయంలో గ్రామానికి చెందిన కొల్లురు ఈశ్వరశర్మ కుటుంబ సభ్యులు శనివారం లక్ష బిల్వార్చాన పూజలు నిర్వహించారు. అర్చకులు సూరా సింహాచలం , బలస సుబ్బారావు ముందుగా గణపతి పూజతో ప్రారంభించి పుణ్యాహవచనం, మంటపారాధన, విష్ణు సహస్రపారాయణం, సప్తస్తుతి పారాయణం, శతసహస్ర సంఖ్యాక బిల్వార్చాన, పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం స్వామివారికి మంగళహారతులిచ్చారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

### 121 మందికి వైద్య పరీక్షలు



అంతరాబలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీధర్

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ అంతరాబ ప్రాథమిక పాఠశాల వద్ద బైదలాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఐ.శ్రీధర్ 121 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబూరావు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

### ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట చేస్తున్న దాతలు

సరుబుజ్జిలి: పెద్దపాలెం గ్రామ సమీపంలో దంతపురిక్షేత్రంలో భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు పెంట కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి నవధాన్యపూజలు, పండిత పరిషత్ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గజ్జన కృష్ణారావు, విగ్రహదాతలు తిర్లంగి జ్యోతిర్మయి, తిరుమలరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

### అమ్మవారి పండగలకు రూ.2 లక్షల విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న తేజేశ్వరరావు

పాతపట్నం: పాతపట్నంలో కొలువైన నీలమణిదుర్గ అమ్మవారి గ్రామ పండగలు ఈ నెల 21 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉత్సవాల నిర్వహణకు పాతపట్నంకు చెందిన వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు రూ.2 లక్షలు శుక్రవారం రాత్రి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నూలు బుజ్జి, పెద్దింటి అప్పారావు, మల్లికార్జునరావు, కొండాల యరకయ్య, రామారావు, మిశ్రో, రాము తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు

ఎల్.ఎన్.పేట: జాబ్‌కార్డు కలిగి ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ సూచించారు. ఉపాధి హామీ పథకం సిబ్బందితో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 7 నుంచి 11 వరకు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పనులు చేయించాలన్నారు.

### హెల్మెట్ ధారణ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అప్పారావు

సారవకోట: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ అప్పారావు సూచించారు. శుక్రవారం జగ్గయ్యపేట సమీపంలో వాహనచోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి వేగంగా ప్రయాణించరాదని సూచించారు. నిర్లక్ష్యంగా రోడ్డు నడిపితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం



శ్రీనివాసాచార్యులపేటలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- సంక్షేమ పథకాల అమలు సీఎం జగన్‌కే సాధ్యం
- రైతు భరోసా కేంద్రాలతో రైతన్నకు ధీమా
- అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ప్రజా సంక్షేమం కోసం దేశంలోనే ప్రథమ స్థానంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేటలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలనే భావనతో ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చి గ్రామ సచివాలయం, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే అన్ని సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలు అందించడంతో పాటు ఆధునిక వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తూ రైతులకు చేయూత అందించడానికి దోహదపడతాయని వివరించారు. గతంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కావాలంటే రైతులు మండల కేంద్రాలకు వెళ్లి పడిగాపులు పడి, లాఠీ దెబ్బలు తిన్న రోజులుండేవని గుర్తు చేశారు. ప్రస్తుత జగనన్న పాలనలో ఇంటి వద్దకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుతున్నాయని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని కొనియాడారు. రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఖాతాలకు పథకాల నగదు నేరుగా జమ చేయడంతో అవినీతి రహిత పాలన సాగుతోందని చెప్పారు. గ్రామాల్లో అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించి తక్షణమే సంక్షేమ పథకాలు అందించాలనే భావతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం గురించి చెప్పే సత్తా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కల్పించారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. జన్మభూమి కమిటీలతో రాష్ట్రాన్ని దోచుకున్న టీడీపీ నేతలకు ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టీడీపీకి చివరి ఎన్నికలని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ చైర్మన్ గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు, ఎంపీటీసీ తమ్మినేని బాలామణి, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి బి.నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

## మినీ గోకులాల నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: మినీ గోకులాల నిర్మాణం ఈ నెల 15లోగా పూర్తిచేయాలని పశువైద్య సహాయ సంచాలకుడు(ఏడీ) మంచు కరుణాకరరావు అన్నారు. పాతపట్నం పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ గోకులాలు నిర్మాణాలు పూర్తి చేసిన వాటికి బిల్లులు ఉపాధి హామీ సిబ్బందితో అప్‌లోడ్ చేయించాలన్నారు. పశువుల పేడ, రక్తనమునాలను ప్రతి వారం నియోజకవర్గ స్థాయిలో ఉన్న ల్యాబ్‌కు పంపించాలని సూచించారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్ టీకాల కార్యక్రమాన్ని జూన్‌లో నిర్వహించాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాలన్నారు. వైఎస్సార్ సంచార పశువైద్యశాల సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైద్యులు పి.అనిల్ కుమార్, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా బుద్ధ జయంతి



బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని పొనుటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం బుద్ధజయంతి ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహానికి రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు శాసుబిల్లి రామరాజు, హెచ్ఎం సింహాచలం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీఎంపీ చైర్మన్ కె.సురేష్, కేశవరావు, ఎ.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

### మేలు రకం విత్తనాల పంపిణీకి చర్యలు



రైతులతో మాట్లాడుతున్న ఏపీఓ హరికృష్ణ

హిరమండలం : ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ సీతంపేట ఏపీఓ హరికృష్ణ అన్నారు. శుక్రవారం గులుమూరు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో గ్రామస్థాయి రైతు సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులకు సబ్సిడీతో కూడిన మేలు రకం విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు.

### లోకోస్ యాప్‌పై అవగాహన

సరుబుజ్జిలి: లోకోస్ యాప్ పట్ల మహిళా సంఘాల సభ్యులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ పీడీ డి.విద్యాసాగర్ అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో లోకోస్ యాప్‌పై శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏపీఎం కమలకుమారి పాండ్యన్, ఎల్‌సీ బసవరాజు, సీసీలు పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న సివిల్ జడ్జి శ్రీభరణి

నరసన్నపేట: ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు, న్యాయవాదులు చొరవ తీసుకోవాలని స్థానిక కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీభరణి సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో నరసన్నపేట, కోటబొమ్మాళి కోర్టు పరిధిలోని పోలీసులు, న్యాయవాదులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు కేసులను సులువుగా పరిష్కరించుకునేందుకు ఇదో మంచి అవకాశమన్నారు. తరచూ వాయిదాలకు రావడంతో కేసు విచారణ పూర్తయ్యే లోపు ఎంతో సమయం వృథా అవుతుందన్నారు. దీనిని గమనించి కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు కక్షిదారుల్లో చైతన్యం కలిగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సీఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## యువ క్లబ్‌లతో పర్యాటకాభివృద్ధి



క్లబ్ సభ్యులతో జిల్లా పర్యాటకాధికారి నారాయణరావు

పాతపట్నం: జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి, తద్వారా టూరిజాన్ని అభివృద్ధి చేయడానికి యువ పర్యాటక క్లబ్‌లు ఉపయోగపడతాయని జిల్లా పర్యాటకాధికారి ఎన్.నారాయణరావు అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులతో యువ క్లబ్ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలు, వాటి ప్రముఖ్యతను వివరించారు. సీఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో వివిధ పర్యాటక ప్రదేశాలను పర్యటించి వీడియోగ్రఫీ చేసి, ఫోటోలు జతచేసి వాటి చరిత్రను తెలుకుని, పలువురికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.చత్రపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు

- గడపగడపకు మన ప్రభుత్వంలో స్పీకర్ తమ్మినేని



లాభాంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సుస్థిరంగా, సుభిక్షంగా ఉంచే శక్తి ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని లాభాం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందకపోతే సాంకేతిక కారణాలు అన్వేషించి అర్హులైనవారికి లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలోనూ పాఠశాల రూపురేఖలు మార్చేలా నాడు–నేడు కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలోనే చికిత్స అందించే ఉద్దేశంతో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా శుద్ధజలం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు లాభాం గ్రామానికి రూ. 69 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే మళ్లీ పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, తహశీల్దార్ ఎస్.రమణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఎంసీ మాజీ చైర్మన్, మండల కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, తొత్తడి సురేష్, మామిడి శ్రీనివాసరావు, వి.గోవిందరావు, బెజ్జిపురపు ఫల్గుణరావు, బెజ్జిపురపు అప్పలనాయుడు, పి.ఆదినారాయణ, డి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా విద్యాకానుక కిట్ల పంపిణీ



ఎంఆర్సీకి చేరిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి పగడాలమ్మ

సారవకోట: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ పక్కాగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ సూచించారు. శుక్రవారం సారవకోట ఎంఆర్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు, రాగిజావ పంపిణీకి అవసరమైన గ్లాసులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రాలకు వచ్చిన కిట్లు వచ్చే నెల 5 నాటికి పాఠశాలలకు చేరాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాడు విద్యార్థులకు కిట్లు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. కిట్ల నాణ్యతను వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, మండల ఇంజినీరింగ్ అధికారులు పరిశీలిస్తారని, నాణ్యత లేకపోతే తిరిగి పంపించాలని సూచించారు. అనంతరం కుమ్మరిగుంట గ్రామంలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. ఆమెతో పాటు ఎంఈఓ ఎం.వి.రమణ, సీఆర్పీలు ప్రసాద్, వసంత, దివ్య, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

**విద్యాకానుక కిట్ల పరిశీలన**

మెళియాపుట్టి: విద్యాదీవెన కిట్లు జాగ్రత్తగా భద్రపరచాలని టెక్కలి డిప్యూటీ ఈవో జి.పగడాలమ్మ అన్నారు. శుక్రవారం కొసమాల పాఠశాలలో స్టాక్ రూం ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిట్లకు చెదలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులకు అందించేటప్పుడు నాణ్యత చూసుకోవాలని అన్నారు. అత్యధిక సంఖ్యలో పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరేలా తల్లిదండ్రులను చైతన్యం చేయాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికల్లా నాడునేడు రెండో విడత పనులు పూర్తి చేయాలని సీఆర్పీలను ఆదేశించారు. మండలానికి 19,009 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ దేవేంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది లింగరాజు, వంశీకృష్ణ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ లక్ష్మునాయుడు

పాతపట్నం: నాటుసారా, గంజాయితో జీవితాలు నాశనం చేసుకోవద్దని పాతపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఎస్‌ఈబీ) సీఐ వై.లక్ష్మునాయుడు అన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం పాతపట్నం ప్రభుత్వ మోడల్ కళాశాలలో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సారా, గంజాయి, డ్రగ్స్‌ను పరిసర ప్రాంతాల్లో వినియోగించినా, రవాణా చేసినా 14500 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకాధికారి ఎన్.నారాయణరావు, ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ చక్రపతి, ప్రసాదరావు, ఎస్‌ఈబీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సునీత

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. మండలంలోని చెన్నాపురం, చోడవరం ఆర్‌బీకేల్లో శుక్రవారం గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న క్వింటాలుకు రూ.1962 చెల్లిస్తున్నామని, రైతులు ఈ నెల 12లోగా ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్‌బీకే వరకూ రైతులే పంటను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. రానున్న ఖరీఫ్‌కు ఎరువులు, విత్తనాలు, పచ్చరొట్ట విత్తనాలు ఎంత మందికి అవసరమో ప్పటి నుంచే ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఈ–క్రాప్ నమోదు ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో సొసైటీ త్రీమేన్ కమిటీ సభ్యులు అంపోలు సుధ పలువురు పాల్గొన్నారు.

## ప్రత్యేక తరగతులు వినియోగించుకోండి



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్

నరసన్నపేట: ఇంటర్మీడియెట్‌లోతప్పిన విద్యార్థులకు నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ నారాయణ స్వామి తెలిపారు. మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో 110 మంది విద్యార్థులు పరీక్షల్లో తప్పారని, వీరిలో సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజులు కట్టిన వారు 81 మంది కాగా, కొంత మంది ప్రత్యేక తరగతులకు వస్తున్నారని చెప్పారు. మిగిలిన వారూ కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధ్యాపకులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారని, మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు గమనించి విద్యార్థులను పంపించాలని కోరారు.

## నెలాఖరులోగా నాడు–నేడు పనులు పూర్తి



నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: పాఠశాలల్లో నాడు–నేడు పనులు ఈ నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. శుక్రవారం హిరమండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, చిన్నకోరాడ, పెద్దకోరాడ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి భవనాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. హెచ్ఎం, సచివాలయ ఇంజినీర్ సహాయకులు సమన్వయంతో పనులు చేయించాలని సూచించారు. కాగా, జగనన్న విద్యాకానుక కిట్లు హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచినట్లు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు.

## సంక్షిప్తంగా..

**అన్నంపేటలో విషాదఛాయలు**

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామానికి చెందిన మజ్జి గోవిందరావు (42) విజయనగరం–నెల్లిమర్ల మధ్య ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ రైల్ నుంచి గురువారం జారిపడి మృతి చెందారు. గోవిందరావు హైదరాబాద్‌లో హోమ్ గార్డుగా సుమారు 12 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి ఫలక్‌నామాలో బయలుదేరి ఎల్ఎన్‌పేట మండలం రావిచంద్రిలోని బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గోవిందరావుకు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి విజయనగరంలో శుక్రవారం పోస్టుమార్టం జరిగింది. అనంతరం అన్నంపేటలో అంత్యక్రియలు నిర్వహించారు.

**మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం**

జలుమూరు: కరవంజ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఖరు తేదీ ఈ నెల 25 కాగా పరీక్ష జూన్ 11న జరుగుతుందని పేర్కొన్నారు. ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఓసీ, బీసీలకు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

**ఓవీపేట మోడల్ స్కూల్లో..**

బూర్జ: మండలంలోని ఓవీపేట ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 25 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7799493969, 9908799417 నంబర్లను సంప్రదించాలని కోరారు.

**9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం**

పాతపట్నం: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న ఉదయం 10 గంటలకు ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.జయంత్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

**11లోగా ఈకేవైసీ చేయించుకోవాలి**

పొందూరు: రాష్ట్ర ఖజానా, గణాంక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులు ఈ నెల 11 సాయంత్రంలోగా ఈకేవైసీ చేయించుకోవాలని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మారావు, పాలిశెట్టి సూర్యప్రకాశరావు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆధార్ కార్డు, ఆధార్ నంబరుతో లింకైన ఫోన్ నంబర్, పీపీఓ నంబర్‌ను ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

**జనావాసాల్లోకి జింక**

పాతపట్నం: పాతపట్నం నగరంలోని ఆల్ఆంధ్రరోడ్డుపైకి శుక్రవారంజింక చొరబడటంతో యువకులు పట్టుకుని ఫారెస్టు అధికారులకు అప్పగించారు. జోగి కొండ దిగువ నుంచి ఆల్ఆంధ్రరోడ్డు పరిసరాల్లోకి దిగిన జింకను కుక్కల గుంపు వెంటాడుతుండడంతో స్థానిక యువకులు చేరదీశారు. అనంతరం ఫారెస్టు బీట్ అధికారి కె.లక్ష్మీనారాయణ, సిబ్బందికి అప్పగించారు. వారు జింకను ద్విచక్రవాహనంపై తమ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అటవీశాఖ రేంజర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు అడవిలోకి విడిచిపెట్టామని ఎఫ్‌బీఓ తెలిపారు.

**భక్తిశ్రద్ధలతో వైశాఖ పౌర్ణమి పూజలు**

హిరమండలం: అంబావల్లిలోని త్రినాథస్వామి ఆలయంలో శుక్రవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని అన్ని వీధుల్లో మంగళవాయిద్యాలు, మేళతాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద బాల బాలికల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.